సాక్షి ఒడిశా


సోమవారం | 4 | మార్చి | 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,41,378
బంగారం	1 గ్రాము 500 మిల్లీ గ్రాములు
వెండి	71 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



వంద ఎకరాల్లో నందనవనం

రాజధానిలో 'ఆనంద వనం' పేరిట వంద ఎకరాల పట్టణ అటవీప్రాంతాన్ని బీడీఏ అభివృద్ధి చేసింది.త్వరలో సీఎం నవీన్ ప్రారంభించనున్నారు.

- 8లో



రూ.950 కోట్లతో..

ఎంకేసీజీ ఆస్పత్రిని రూ.950 కోట్ల రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా చెప్పారు. శనివారం భవనాలకు శంకుస్థాపన చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

బీజేడీకి మాజీ ఎమ్మెల్యే ముకుందో గుడ్‌బై



ముకుందో సోడి

మల్కన్‌గిరి: జిల్లాలో బీజేడీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ముకుందో సోడి ఆదివారం పార్టీకి రాజీనామా చేశారు. 2009లో బీజేడీ తరపున మల్కన్‌గిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో తొలుత అలకబూనినా తర్వాత పార్టీలోనే కొనసాగారు. తాజాగా త్వరలో జరగనున్న ఎన్నికల్లో సైతం టికెట్ ఇచ్చే అవకాశం కనిపించకపోవడంతో రాజీనామా చేశారు. త్వరలోనే బీజేపీలో చేరుతానని ముకుందో ప్రకటించారు.

సారాబట్టీలపై దాడులు



కలియగావ ప్రాంతంలో సారా బట్టీ

జయపురం: జయపురం సమితిలోని కలియగావ పంచాయతీ పరిధిలో సారాబట్టీలపై జయపురం అబ్కారీ సిబ్బంది దాడులు చేపట్టారు. రెండున్నర లక్షల విలువైన నాటు సారా, తయారీ సామగ్రి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్త ఆదివారం తెలిపారు. ఏడు బట్టీలపై దాడులు జరిపి 126 లీటర్ల నాటుసారా, 2,400 లీటర్ల ఊట ధ్వంసం చేశామని చెప్పారు. ఈ దాడుల్లో దత్తతో పాటు ఏఎస్‌ఐ ప్రదీప్ కుమార్ దొలాయ్, సిబ్బంది పాల్గొన్నారు. సారా తయారీదారులు పరారయ్యారు. కలియగాం ప్రాంతంలో అబ్కారీ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు సారా తీసుకెళ్తూ పట్టుబడినట్లు చెప్పారు. వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

బీజేడీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో రబినారాయణ నందో

జయపురం: బొరిగుమ్మ సమితి బెనాపూర్‌లో శనివారం రాత్రి మిశ్రణ పర్వ్‌లో పలువురు నాయకులు బీజేడీలో చేరారు. మాజీ మంత్రి రబినారాయణ నందో అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బెణసూర్ పంచాయతీ సమితి సభ్యులు జగన్నాథ్ ముదులి, అనుచరులు అధికార బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన పట్నాయక్ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు నచ్చి పార్టీలో చేరుతున్నట్లు ముదులి తెలిపారు. కార్యక్రమంలో బీజేడీ పర్యవేక్షకులు గుప్త గంతాయిత్ తదితరులు పాల్గొన్నారు.

మిక్సర్ మిషన్ బోల్తాపడి యువకుడి దుర్మరణం



బోల్తా పడిన మిషన్



అనిల్ హికక (ఫైల్)

రాయగడ: సిమెంట్, మెటల్ కలిపే మిక్సర్ మిషన్ బోల్తాపడిన ఘటనలో యువకుడు దుర్మరణం పాలవ్వగా మరొకరికి గాయాలయ్యాయి. జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాంగళి గ్రామంలో శనివారం కళ్యాణ సింగుపూర్ గ్రామానికి చెందిన అనిల్ హికక (28), మున్నాలు రైల్వే కాంట్రాక్టరు వద్ద రోజు కూలీ పనికి వెళ్లారు. ఎప్పటిలాగే పాంగళి ప్రాంతంలో రైల్వే పనులు చేపడుతుండగా మిక్సర్ మిషన్ బోల్తాపడింది. అక్కడే ఉన్న మున్నా, అనిల్‌లు మిషన్ కింద ఇరుక్కుపోగా మున్నా గాయాలతో బయటపడ్డారు. ఊపిరాడక అనిల్ మృతి చెందాడు. తెరువలి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నష్టపరిహారం చెల్లించాలని మృతుని కుటుంబీకులు కోరుతున్నారు.

వేడుకలకు వేళాయె..!



భువనేశ్వర్‌లోని లింగరాజు దేవాలయం

- మహాశివరాత్రికి లింగరాజు ఆలయం సిద్ధం
- పూజా కార్యక్రమాలు ఖరారు చేసిన ఉత్సవ కమిటీ
- 8వ తేదీ రాత్రి 10 గంటలకు ఆకాశ దీప దర్శనం
- జాగరణ యాత్రకు ప్రత్యేక ఏర్పాట్లు

భువనేశ్వర్: రాష్ట్ర రాజధానిలోని ప్రాచీన శైవక్షేత్రం లింగరాజు దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవ కార్యక్రమాల వేళలు ఖరారయ్యాయి. ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి ఖుర్దా అదనపు జిల్లా కలెక్టరు, లింగరాజు దేవస్థానం కార్య నిర్వహణ అధికారి రుద్ర నారాయణ మహంతి అధ్యక్షతన స్థానిక సర్క్యూట్ హౌసులో సమీక్ష సమావేశం నిర్వహించారు. భువనేశ్వర్ నగర మేయరు సులోచన దాస్, సేవాయత్‌లతో సంప్రదింపులు జరిపి మహా శివ రాత్రి ఉత్సవ కార్యక్రమాలు, వేళల్ని ఖరారు చేశారు. ఆలయ శిఖరాన ఈ నెల 8వ తేదీ రాత్రి 10 గంటలకు మహా దీప దర్శనం లభిస్తుందని ప్రకటించారు

అదనపు సౌకర్యాలు..

మహా శివరాత్రి పర్వ దినం పురస్కరించుకుని భక్తుల తాకిడి పుంజుకుంటుంది. పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుద్దీపాలు, భారత పురావస్తు శాఖ కార్యకలాపాలు, శాంతిభద్రతల ఏర్పాట్లు సమీక్షించారు. సకాలంలో నిర్ధారిత సమయానికి ఆకాశ దీప దర్శనం ఏర్పాట్లు చేయాలని అనుబంధ వర్గాలను ఆదేశించారు. భక్తుల రాకపోకల కోసం అంతరాయం లేని కాలి నడక సౌకర్యం కల్పించేందుకు నిర్ణయించారు. నగరం నలుమూలల నుంచి భక్తుల రాకపోకలకు వీలుగా మో బస్సుల సంఖ్య పెంచనున్నట్లు నగర మేయరు సులోచనదాస్ తెలిపారు. శివరాత్రి, మరుసటి రోజు వరకు అదనపు మో బస్సుల సౌకర్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. రద్దీ నియంత్రణకు లింగరాజు దేవాలయం సింహ ద్వారం నుంచి అరుణ స్తంభం వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. మందిరం గర్భ గృహం, ఆలయం ద్వారాలు ఇతర ప్రాంగణాల్ని భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ పరిశుభ్రపరచి యాత్రకు సిద్ధం చేస్తుంది. ఆలయ పరిసరాల్లో బీఎంసీ ఆస్పత్రిలో అత్యవసర వైద్య, చికిత్స సదుపాయాల్ని కల్పిస్తారు. స్థానిక పాత డాక్ బంగళా ప్రాంగణం బి.ఎం. ఉన్నత పాఠశాల, గోసాగరేశ్వర ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలు ప్రత్యేక వాహన పార్కింగు కేంద్రాలుగా నిర్ణయించారు. ఈ పరిసరాల నుంచి ఆలయ ప్రాంగణం వరకు రహదారికి ఇరువైపులను ఛాయా ప్రాంతాలుగా ప్రకటించారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఖుర్దా జిల్లా కలెక్టరు, మేయర్ తదితరులు

వేకువజామున ప్రారంభం..

- లింగరాజు ఆలయ అధికారులు ఖరారు చేసిన క్రతువు కార్యక్రమాల ప్రకారం మహాశివరాత్రి జరిగే ఈ నెల 8వ తేదీ తెల్లవారు జామున 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య స్వామి వారి మంగళ హారతి, అబాకాష్ సేవలు నిర్వహిస్తారు.
- 3.30 గంటలకు భక్తులకు సర్వ దర్శనం ప్రారంభమై ఉదయం 11 గంటల వరకు కొనసాగుతుంది.
- మధ్యాహ్నం 12 నుంచి 12.45 గంటల మధ్య లింగరాజు మహా ప్రభువు మహాస్నానం, అలంకరణ నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు ధూప సేవ అనంతరం, మధ్యాహ్నం 3.45 గంటలకు భక్తులకు సర్వ దర్శనం పునఃప్రారంభిస్తారు.
- సాయంత్రం 5.45 నుంచి 7 గంటల మధ్య లింగరాజు రెండో పూట ధూపం సమర్పిస్తారు.
- రాత్రి 7 గంటలకు విరామం, 7.30 గంటలకు సంధ్యా హారతి నిర్వహిస్తారు.
- రాత్రి 10 గంటలకు సంధ్యా ధూపం పూర్తయిన తర్వాత ఆలయ అర్చకులు మహా దీపాన్ని ఆలయ శిఖరాన ఏర్పాటు చేస్తారు.
- రాత్రి 10 గంటల నుంచి 11 గంటల వరకు భక్తులను మళ్లీ ఆలయంలోకి దర్శనం కోసం అనుమతిస్తారు.
- మార్చి 9న తెల్లవారుజామున 4.30 గంటలకు హరిహర భేటీ ఉత్సవం తర్వాత లింగరాజుకు బొడొ సింగార్, విరామ సేవలు నిర్వహిస్తారు.

పల్స్‌పోలియో విజయవంతం



రాయగడ: పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ మహాజన్



భువనేశ్వర్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ సులోచన దాస్



జయపురం: చిన్నారికి పోలియో చుక్క వేస్తున్న హెల్త్ వర్కర్



పర్లాకిమిడి: పోలియో చుక్కలు వేస్తున్న సి.డి.ఎం.ఓ. డాక్టర్ పాత్రో

భువనేశ్వర్: పోలియో చుక్కలు పిల్లల చక్కని జీవిత సోపానాలుగా నిలుస్తాయని నగర మేయరు సులోచన దాస్ అన్నారు. భువనేశ్వర్‌లోని ఐఆర్‌సీ విలేజ్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో ఆదివారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇంటెన్సిఫైడ్ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ 2024 ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోలియో చుక్కల ఉద్యమం కలిసికట్టుగా విజయవంతం చేసేందుకు ప్రతిజ్ఞ చేద్దామని పిలుపునిచ్చారు.

- **జయపురం:** కొరాపుట్ జిల్లాలో పల్స్‌పోలియో విజయవంతమైంది. లక్షా 69 వేలమంది పిల్లల్లో దాదాపు 90 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. ఈ నెల 4, 5వ తేదీల్లో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు, హెల్త్ వర్కర్లు ప్రతి ఇంటికి వెళ్లి పోలియో చుక్కలు వేసుకోని పిల్లలకు చుక్కలు వేస్తారని ఆ వర్గాలు తెలిపాయి.
- **రాయగడ:** జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ స్థానిక ప్రభుత్వ హస్పటల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.
- **పర్లాకిమిడి:** గజపతి జిల్లా పర్లాకిమిడి పట్టణంలో మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పల్స్‌పోలియో చుక్కల మందు కార్యక్రమాన్ని జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్, సి.డి.ఎం.ఓ.డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో ప్రారంభించారు. జిల్లాలో 574 బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యం.కె.భుయ్యాన్, ఏ.పి.పి.హెచ్.ఓ డాక్టర్ ఇందిరా మహాపాత్రో, యునైటెడ్ నేషన్స ఏ.పి.ఏ. సిప్రాబల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి బీజేడీ ఎమ్మెల్యే అరబింద ధాలి

భువనేశ్వర్: రాష్ట్రంలో అధికార పక్షం బిజూ జనతా దళ్ నుంచి భువనేశ్వర్ జయదేవ్ శాసనసభ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సిటింగ్ ఎమ్మెల్యే అరబింద ధాలి ప్రధాన విపక్షం భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర శాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పార్టీ ప్రముఖుల సమక్షంలో బీజేడీకి రాజీనామా చేసి బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయన్ను బీజేపీ రాష్ట్ర శాఖ నాయకులు స్వాగతించి పార్టీ సభ్యత్వం కల్పించారు. కార్యక్రమానికి బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి విజయపాల్ సింగ్ తోమర్, కో–ఇన్‌చార్జి, రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి, ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు. అధికార పక్షం బీజేడీ నుంచి రాజీనామాకు గల కారణాల్ని ఆయన వెల్లడించలేదు.

బీజేపీ ప్రభుత్వం ఖాయం..

ఈ సందర్భంగా అరబింద ధాలి మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో నాయకులు భారతీయ జనతా పార్టీలో చేరుతున్నందున ఒడిశాలో 100కుపైగా సీట్లతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 1992లో జరిగిన ఉప ఎన్నికల్లో మల్కన్‌గిరి నియోజకవర్గం నుంచి అరబింద ధాలి బీజేపీ టికెట్‌పై పోటీ చేసి తొలిసారిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. వరుసగా రెండుసార్లు సీటు నిలబెట్టుకున్నారు. 2004లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థితో తలపడి ఓడిపోయారు. 2009 సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీకి గుడ్–బై చెప్పి బీజేడీలో చేరారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా గెలుపొంది భువనేశ్వర్ జయదేవ్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



కాషాయ కండువా కప్పుకున్న అరబింద ధాలి

తాజాగా బీజేడీకి రాజీనామా చేసి పాత గూటికి తిరిగి చేరారు. 2000, 2004 మధ్య బీజేడీ, బీజేపీ కూటమి ప్రభుత్వంలో నవీన్ పట్నాయక్ కొలువులో అరబింద ధాలి సహకార, జౌళి, చేనేత, వాణిజ్యం, రవాణా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

బీజేడీ కనుమరుగు..

గత నెలలో బీజేపీలో చేరిన ఖుర్దా జిల్లా చిలికా శాసన సభ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే ప్రశాంత జగదేవ్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో పెనుమార్పు జరుగుతుందన్నారు. ఒడిశా రాష్ట్రంలోనూ మార్పు జరిగి బీజేడీ కనుమరుగై బీజేపీగా రూపాంతరం చెందుతుందని చెప్పారు. త్వరలో చాలా మంది బీజేడీ నాయకులు కాషాయ పార్టీలో చేరుతారని ఆయన పేర్కొన్నారు. గత నెల 29న ఖుర్దా జిల్లా చిలికా నుంచి ప్రశాంత జగదేవ్, 21న మరో బీజేడీ బహిష్కృత నేత, గంజాం జిల్లా గోపాల్‌పూర్ సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి అధికార బీజేడీ నుంచి ఫిరాయించి భారతీయ జనతా పార్టీలో చేరారు. వీరి తర్వాత సీనియర్ బీజేడీ నేత, రాష్ట్ర మాజీ మంత్రి దేబాశిష్ నాయక్ బీజేపీలో చేరారు.

గిరి ప్రాంతాల్లో డ్రోన్ సేద్యం



సింధిగూడ వద్ద డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న జి.వి.రెడ్డి, రాజేంద్ర మజ్జి



డ్రోన్ ద్వారా వ్యవసాయ మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం పరుగులు పెడుతుంటే వెనుకబడిన నబరంగ్‌పూర్ జిల్లాలో గిరిజనులు పాత పద్ధతులే అవలంబిస్తున్నారు. ఇందులో మార్పు తెచ్చి రైతులకు అవగాహన కల్పించడానికి జిల్లా వ్యవసాయ విభాగం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దీనిలో భాగంగా ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితిలో డ్రోన్ ద్వారా వ్యవసాయ మందులు చల్లే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి జి.వి.రెడ్డి పర్లాకిమిడిలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయం నుంచి డ్రోన్ తెప్పించారు. సింధిగూడ గ్రామంలో 30 ఎకరాల పంటకు కేవలం 3 గంటల లోపే మందులు చల్లి చూపించారు. ఇదే కార్యక్రమం మనుషులు చేస్తే సుమారు మూడు రోజులు పడుతుంది. డ్రోన్ అద్దె ఎకరాకు రు.500 తీసుకుంటున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న రైతు డ్రోన్‌ని కొనుగోలు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కిసాన్ డ్రోన్ పథకం కింద సహాయం చేస్తారు. మార్కెట్‌లో ఈ డ్రోన్ ఖరీదు రు.10.5 లక్షలు కాగా, కిసాన్ డ్రోన్ పథకం కింద 50 శాతం సబ్సిడీ అందిస్తారు. స్వయం సహాయక సంఘం కొనుగోలు చేస్తే 75 శాతం రాయితీ అందుతుంది. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని జి.వి.రెడ్డి విజ్ఞప్తి చేశారు. నబరంగ్‌పూర్, నందాహండి, పపడాహండి, కొసాగుమ్మ, రాయిఘర్, ఉమ్మర్ కోట్ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మజ్జి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు నడక పోటీలు



విజేతలతో క్లబ్ సభ్యులు

రాయగడ: స్థానిక జంఝావతి మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రేమ్‌పహాడ్ కారిడార్‌లో ఆదివారం మహిళలకు నడక పోటీలు నిర్వహించారు. 20, 30, 40 ఏళ్ల విభాగంలో 40 మంది పాల్గొన్నారు. విజేతలకు డిస్ట్రిక్ట్ వాకర్స్ గవర్నర్ కిశోర్ పండా ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు అరుణా బెహరా మాట్లాడుతూ నడకపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు.

ఝరపడా జైలు ఖైదీకి అస్వస్థత

- గంజాయి సేవించడమే కారణం!

భువనేశ్వర్: స్థానిక ఝరపడా ప్రత్యేక కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ అస్వస్థతకు గురయ్యాడు. కారాగారంలో ఉండగా గంజాయి అధిక మోతాదులో పీల్చడమే దీనికి కారణమని సమాచారం. ఝరపడా ప్రత్యేక జైలు రాష్ట్రంలో అత్యంత భద్రతతో కూడినది. ఇందులో అండర్ ట్రయల్ ఖైదీ (యూటీపీ)గా ఉన్న రంజన్ బెహరా (19) గంజాయి తాగిన తర్వాత ఛాతీలో నొప్పిగా ఉందంటూ తోటి ఖైదీలకు చెప్పడంతో సమాచారం అందుకున్న జైలు అధికారులు శనివారం రాత్రి అక్కడి చికిత్స కేంద్రంలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో క్యాపిటల్ ఆసుపత్రికి తరలించారు. ఛాతీ నొప్పి గురించి ఫిర్యాదు చేయడానికి ముందు బెహరా గంజాయి పీల్చినట్లు ఇతర ఖైదీలు జైలు వార్డర్‌కు తెలియజేసినట్లు సమాచారం. గతంలోనూ పలుమార్లు ఝరపడా జైలు ఆవరణలో పోలీసులు మద్యం, ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్న దాఖలాలు ఉన్నాయి.

క్లుప్తంగా

కిలో గుండు.. 888 గ్రాములే ఉండు!

- తూనికల్లో మోసపోతున్న వినియోగదారులు
- పట్టించుకోని అధికారులు



888 గ్రాములను చూపిస్తున్న కిలో గుండు

రాయగడ: తూనికలు, కొలతల విభాగ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొందరు వ్యాపారులు లాభాలు ఆర్జిస్తుండగా.. వినియోగదారులు దారుణంగా మోసపోతున్నారు. ముఖ్యంగా మంసాహారం, కూరగాయల దుకాణాల్లో తూకం మోసాలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. కిలో బరువు గల కొలత గుండును ఎలక్ట్రానిక్ కాటాలో వేయగా 888 గ్రాములే చూపుతోంది. స్థానిక ఆర్‌కే నగర్‌లో ఈ మోసం వెలుగుచూసింది. 112 గ్రాములు తక్కువ రావడంతో వినియోగదారుడు లబోదిబోమన్నాడు. ఇటువంటి మోసాలు అరికట్టేందుకు స్థానిక తూనికలు, కొలతల విభాగ అధికారులు ప్రతి రెండేళ్లకు తనిఖీలు నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేయాలి. ఇక్కడ అటువంటి కార్యకలాపాలు సాగడం లేదు. ఈ విషయమై తూనికలు, కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రియరంజన్ మహతి దృష్టికి తీసుకెళ్లగా.. తాను రాయగడతో పాటు గుణుపూర్, గజపతి ప్రాంతాలకు ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తుండటంతో సకాలంలో తనిఖీలు నిర్వహించలేకపోతున్నామని చెప్పారు.

ఘనంగా శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు



ఊరేగింపులో శివ సాధువేషధారణలు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్ బాగ్ పేటలోని దేవాంగుల వీధిలో శ్రీశైల మల్లికార్జునస్వామికి అందజేయనున్న తలపాగాను ఆదివారం గ్రామంలో ఘనంగా ఊరేగించారు. 365 మూరల తలపాగాను ఈనెల 5న గౌరీ వినాయక కమిటీ ఆధ్వర్యంలో అందజేసేందుకు బయల్దేరుతామని నిర్వాహకులు తెలిపారు. తూతిక వెంకటరావు నిర్వహణలో తలపాగాను శివరాత్రి రోజుకు అందించడం చాలా ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఫాజుల్‌బాగ్ పేట పురవీధుల్లో కోలాటాలు, శివ సాధువుల వేషధారణలతో మల్లన్న తలపాగాను ఊరేగించారు.


జీఎస్‌ఆర్ గోల్డ్, డైమండ్స్ షాపు ప్రారంభం



గోల్డ్ షాపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్ కూడలిలో ఆదివారం జీఎస్‌ఆర్ గోల్డ్, డైమండ్స్ షాపును ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ప్రారంభించారు. ఇలాంటి షాపులు నరసన్నపేటలో మరిన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బంగారం వ్యాపారంలో నరసన్నపేటకు జిల్లాలోనే మంచి పేరు ఉందని, దీన్ని నిలబెట్టుకొని వ్యాపారాభివృద్ధి చేసి నరసన్నపేట ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుడ్ల నాగరాజు, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని తిరువీధి



వెండి సింహవాహనంలో ఊరేగుతున్న ఆదిత్యుని ఉత్సవమూర్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి తన దేవేరులతో ఆదివారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో వెండి సింహవాహనంపై కాసేపు విహరించారు. మాఘమాసం నాల్గో ఆదివారం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులకు పూర్తి అలంకరణతో వేదమంత్రోచ్చరణలు, మంగళధ్వనుల మధ్య తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు హాజరయ్యారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

వంద ఎకరాల్లో నందనవనం



ఆనంద వనం

- 'ఆనంద వనం' పేరిట అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన బీడీఏ
- ఐదు వేల ఔషధ మొక్కల పెంపకం
- త్వరలోనే ప్రారంభించనున్న సీఎం నవీన్

భువనేశ్వర్: రాజధానిలో ఆహ్లాదకరమైన, ఆరోగ్యదాయకమైన వాతావరణం కల్పించేందుకు భువనేశ్వర్ డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ) 'ఆనంద వనం' పేరిట పట్టణ అటవీప్రాంతాన్ని అభివృద్ధి చేసింది. స్థానిక కళింగనగర్ ప్రాంతంలో సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో అటవీశాఖ సహకారంతో బీడీఏ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసింది. కొన్నేళ్ల క్రితం నిర్మానుష్యంగా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు హరిత ఛాయలతో సరికొత్తగా రూపుదాల్చుకుంది. నగరంలో అనేక పార్కులు ఉన్నప్పటికీ ప్రజలకు సహజ వాతావరణం లభించడం లేదు. కాంక్రీట్ జంగిల్ పెరుగుతున్న కొద్దీ సహజ వాతావరణం తగ్గిపోతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆనంద వనం రూపకల్పన జరగడం విశేషం. ఇందులో ప్రవేశించిన క్షణంలో దట్టమైన అడవిలోకి అడుగు పెట్టిన అనుభూతి పొందుతారు. రహదారికి ఇరువైపులా దాదాపు 5 వేల ఔషధ మొక్కలు నాటారు. వేప, కరంజ్, వెదురు, మర్రి వంటి పెద్ద చెట్లు స్వచ్ఛమైన ప్రాణ వాయువు (ఆక్సిజన్) అందించేందుకు చర్యలు చేపట్టారు. పార్క్‌లోని అటవీ అనుభవాన్ని సైక్లింగ్ ద్వారా కూడా ఆస్వాదించవచ్చు.

రెండు భాగాలుగా..

ఆనంద వనం అటవీ పర్యావరణంతో దట్టమైన పచ్చ పచ్చని వృక్ష సంపద ఛాయలో అపురూప విశ్రాంతి స్థలంగా రూపుదిద్దుకుంది. పలు వర్గాల సందర్శకుల్ని దృష్టిలో పెట్టుకుని సమగ్రంగా ఏర్పాట్లు చేశారు. దీనిని రెండు భాగాలుగా విభజించి మధ్యలో కాలి నడక వంతెన (ఎఫ్‌ఓబీ) ఏర్పాటు చేశారు. ట్రీ హౌస్‌లు, తాడు వంతెన (రోప్ బ్రిడ్జ్), చెక్క వంతెన, గులాబీ తోట వంటి ఆకర్షణీయమైన అంశాలు ఎన్నో ఇమిడి ఉన్నాయి. రాళ్ల రప్పలు, సైకిలు బాటలతో బాటు సునాయాశమైన పూదోట బాటలు, ఆరోగ్యవంతమైన చెట్ల ఛాయల మధ్య ఆబాలగోపాలం ఆహ్లాదం పొందేలా సందర్శకుల్ని ఆకట్టుకుంటోంది. సందర్శకులు కూర్చునే సౌకర్యాలు, వివరణ కేంద్రం, ఓపెన్-ఎయిర్ థియేటర్, మిషన్ శక్తి స్టాల్స్, టాయిలెట్లు, పార్కింగ్ స్థలాలు కూడా సిద్ధం చేశారు.

చెట్ల స్వీయ పరిచయం..

పార్క్‌లోని చెట్లు తమ పరిచయాన్ని ఇట్టే తెలియజేస్తాయి. ప్రతి చెట్టుకు బార్ కోడ్ జోడించారు. మొబైల్ ఫోన్‌లో స్కాన్ చేయడం ద్వారా అది ఏ చెట్టు, ఎక్కడెక్కడ తరచుగా కనిపిస్తుంది, ఎలాంటి ఔషధ గుణాలు ఉన్నాయి తదితర సమాచారం లభ్యమవుతుంది. ఫలితంగా విశ్రాంతి వినోదమే కాకుండా ఔషధ మొక్కల విజ్ఞానాన్ని పెంపొందించే అవకాశాలు కూడా ఉన్నాయి.

ఎఫ్‌ఓబీ ప్రధాన ఆకర్షణ..

రహదారికి ఇరువైపులా అడవిని కలిపే కాలి నడక వంతెన (ఎఫ్‌ఓబీ) ప్రధాన ఆకర్షణ. 'ట్రీ హౌస్', 'రోప్ బ్రిడ్జ్', 'వుడెన్ బ్రిడ్జ్', 'గెజిబో', 'స్టోన్ పాత్', 'రోజ్ గార్డెన్', ప్రత్యేక పూలతోట సందర్శకులను ప్రధాన ఆకర్షణ కేంద్రాలుగా ఆకట్టుకుంటాయి. మధ్యలో ఉన్న చెరువు, అందులోని అందంగా వికసించిన తామర పూలు ఆహ్లాదాన్ని ప్రసాదిస్తాయి.

అక్కడక్కడా షెడ్లు..

వర్షం, మంచు నుంచి కాపాడేందుకు అక్కడక్కడా షెడ్లు సిద్ధం చేశారు. మిషన్ శక్తి ద్వారా పార్కింగ్, ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్, వివిధ స్టాల్స్, టాయిలెట్లు, సీటింగ్ ప్రాంతాలు తదితరాలు పూర్తయ్యాయి. అక్కడ అడవి అనుభూతి చెందడం వల్ల చుట్టుపక్కల ప్రజలు ప్రతిరోజూ ఉదయపు నడక కోసం తరలివస్తున్నారు. సిటీ ఫారెస్ట్ డివిజన్ కే-3 ప్రాంతంలో ఆనంద వనం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి. త్వరలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీనిని ప్రారంభించనున్నారు.

రూ.950 కోట్లతో ఎంకేసీజీ ఆస్పత్రి అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్ పండా

బరంపురం : దక్షిణ ఒడిశా ప్రజల ఆరోగ్య ప్రదాత ఎంకేసీజీ ఆస్పత్రిని రూ.950 కోట్ల రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా చెప్పారు. శనివారం ఎంకేసీజీ ఆస్పత్రి ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వ కుటుంబ, ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఎంకేసీజీ ఆస్పత్రి అభివృద్ధిలో భాగంగా రూ.950 కోట్ల నిధులతో నూతన నిర్మాణ భవనాలకు బరంపురం ఎంపీ చంద్ర శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌కుమార్ పండా, కలెక్టర్ దివ్యజ్యోతి పరిఢా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పండా మాట్లాడుతూ సీఎం నవీన్ పట్నాయక్, టి-5 కార్యదర్శి కార్తికేయ పాండ్యన్ ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. 400 వందల పడకలతో నూతన భవనం, మరో రూ.100 కోట్ల నిధులతో సూపర్ స్పెషాలిటీ చికిత్స భవనం, మరో రూ.220 కోట్లతో ఇండోర్ స్టేడియం తదితర నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

క్రికెట్ టోర్నీ విజేత ఎకంబా



విజేత జట్టుతో నిర్వాహకులు, అతిథులు

జయపురం: స్థానిక ఎకంబా క్రీడా మైదానంలో నలుగు రోజులుగా జరుగుతున్న క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఫైనల్ పోటీలో రొండపల్లి పంచాయతీ జట్టుపై ఎకంబా పంచాయతీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. జయపురం సమితి సంక్షేమ విస్తరణ అధికారి అభా ప్రధాన్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు జయపురం సమితి చైర్‌పర్సన్ తిలోత్తమ ముదులి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు తొపతి పట్నాయక్, ఎస్‌డీసీ అధ్యక్షుడు శంకుదొర హల్వ, మాజీ సర్పంచ్ బైద్యనాథ్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న మానవ అధికారి సురక్షా మంచ్ ప్రతినిధులు

బరంపురం : రాష్ట్రంలో లబ్ధిదారులైనా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల పింఛన్‌ను రూ.5 వేలకు పెంచాలని మంచ్ కన్వీనర్ అబని కుమార్ గయా డిమాండ్ చేశారు.

ఈ మేరకు శనివారం బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) కార్యాలయం ఎదుట మానవ అధికారి సురక్షా మంచ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గయా మాట్లాడుతూ కటక్, భువనేశ్వర్ మాదిరిగా బరంపురం నగరంలోనూ పింఛన్ రూ.5వేలకు పెంచాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం బీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో మంచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షాలకు అవకాశం

భువనేశ్వర్: రాష్ట్రంలో పగటి పూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి దగ్గరగా ఉన్నాయని, అయితే పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ శాఖ ప్రాంతీయ కేంద్రం (ఐఎండీ) ఆదివారం తెలిపింది. రానున్న 4, 5 రోజుల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పులు ఉండవని ప్రకటించింది. సోమవారం ఉదయం బర్‌గఢ్, సంబల్‌పూర్, దేవ్‌గఢ్, ఝూర్సుగుడ, సుందర్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, అంగుల్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తదుపరి 24 గంటల్లో సుందర్‌గఢ్, కెంజొహర్, మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, ఢెంకనాల్, జాజ్‌పూర్‌లలో ఒకటి లేదా రెండు చోట్ల ఇదే విధమైన వాతావరణం ఉంటుందని ప్రకటించింది. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో తేలికపాటి వర్షం కురిసింది.

‘ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి’



మందులు అందిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్

శ్రీకాకుళం కల్చరల్: ప్రజలంతా ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. స్థానిక పాతబస్టాండు వద్ద గల మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రంలో ఉన్న రెడ్‌క్రాస్ మెడిసిన్ బ్యాంక్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన, విశిష్ట అతిథి మున్సిపల్ కమిషనర్ ఎ.తమీమ్ అన్సారియాలు ప్రారంభించారు. ప్రముఖ వైద్యుల సహకారంతో సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అక్కడ అందుతున్న వైద్యసేవలను, వైద్యపరికరాల కోసం అడిగి తెలుసుకున్నారు. ముందుగా రెడ్‌క్రాస్ ఫౌండర్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావును, డాక్టర్ పిఎల్‌ఎన్‌రాజు, డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, డాక్టర్ దినేష్‌కాంత్ ఉదయాన, డాక్టర్ ప్రేమ్ సర్కారీ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఉదయాన కిరణ్‌కాంత్, డాక్టర్ బటారం అరుణ్‌కుమార్ గుప్తా, డాక్టర్ ఎస్.వెంకట రాజేష్, డాక్టర్ కె.ప్రసన్నలక్ష్మీ, డాక్టర్ జె.నిఖితలను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కారదర్శి బి.మల్లేశ్వరరావు, డీపీఆర్ఓ కె.బాలమాన్‌సింగ్, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సభ్యులు కల్యాన్, యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, బి.సతీష్‌కుమార్, సుజాత, పవన్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

గుప్తేశ్వర్‌లో సౌకర్యాలు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న దురువ నేతలు

జయపురం: సుప్రశిద్ధ శివక్షేత్రం గుప్తేశ్వర్‌లో భక్తులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని దురువ సమాజ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గుప్తేశ్వర మందిర ప్రాంతంలోని శివ గణేష్ మందిరానికి రోడ్డు వేయాలని, పాతాలేశ్వరి మందిరానికి వెళ్లేందుకు ఘాట్ తవ్వి రోడ్డు వేసి మందిరంపై షెల్టర్ ఏర్పాటు చేయాలని, ప్రథమ ద్వారం వద్ద వంటగది ఏర్పాటు చేయాలని, పర్వత గుహలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలని, పాతాళ గంగ వెళ్లే దారిలో జాలీ గేట్ ఏర్పాటు చేయాలని, గుప్తేశ్వర మందిర గేటు నుంచి నదిఘాట్ వరకు కొబ్బరి దుకాణాలను తొలగించ వద్దని, గుప్తేశ్వర్‌లో మద్యం అమ్మకాలపై కఠిన చర్యలు చేపట్టాలని, గుప్తేశ్వర్ గేటు నుంచి మందిరం వరకు శాశ్వత బారికేడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ఝుదిష్టర్ రౌళో, దళిత నేత నంద హరిజన్, బుధా దురవగుప్త దురువ, రాజు దురువ, సోంబారు దురువ, ఈశ్వర దురువ, మురారీ దురువ, సుభద్ర దురువ, గొనిసి దురువ, యితి దురువ, అభి దండసేన తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్టు



పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: కలిమెల సమితి పనిమేట్ల గ్రామంలో జూదం శిబిరంపై ఐఐసీ చంద్రకాంత్ తండి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురిని పట్టుకుని రూ.4250 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఐఐసీ తెలిపారు.

‘జీడికి మద్దతు ధర ఇవ్వాలి’



ప్రసంగిస్తున్న విమలక్క

పలాస: జీడి పిక్కలను పండించే రైతులకు కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని, 80కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలోని ఆచల గురు ఆశ్రమంలో ఆదివారం జీడి పిక్కల మద్దతు ధర కోరుతూ రైతుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఉభయతెలుగురాష్ట్రాల అరుణోదయ గౌరవ అధ్యక్షురాలు విమలక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీడి మద్దతు ధర విషయంలో గతం నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర విషయంలో జీడి వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై వదిలేయడం సరికాదన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేరు గురయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.వీరాంజనేయులు, బి.రమేష్, ఎస్.నారాయణరావు, టి.భాస్కరరావు, డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వద్ద మహిళల కోలాట ప్రదర్శన



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు

మందస: వాసుదేవుడి పెళ్లికి ఊరంతా అతిథులయ్యారు. మందసలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి కల్యాణం కడు రమణీయంగా నిర్వహించారు. ఆగమ శాస్త్రరీతిలో స్వామి పరిణయాన్ని వేద పండితులు జరిపించారు. త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు క్రతువు నిర్వహించారు. పూబంతులాట, పుష్పమాల నృత్యాలు, కట్నచదివింపులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

రాష్ట్ర పశు సంవర్థక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు వాసుదేవుని దర్శించుకోగా.. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి సీదిరి దంపతులు స్వామి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు ఆలయ అభివృద్ధికి రూ.లక్ష అందజేశారు. స్వామి ఆశీస్సులు ఈ ప్రాంతంపై ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా ఆండాళ్లగోష్ఠి, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. భగవంతునికి నిర్ణీత రూపం లేదని, వాక్కు, మనస్సునకు అందని అతీతుడని త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి అభివర్ణించారు. రాత్రి గరుడవాహనసేవలో కల్యాణ దంపతులైన శ్రీభూసమేత వాసుదేవుని మందస పురవీధుల్లో ఊరేగించారు.

చివరి దశకు కమిటీ నివేదికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదులపై వచ్చిన అంశాల విచారణకు నియమించిన కమిటీల నివేదికలు చివరి దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి నెల చివరి నాటికి నివేదికలు సమర్పించాలని వీసీ కేఆర్ రజిని ఆదేశించారు. ప్రధానంగా 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల అక్రమ నియామకాలు అంశంపై డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ కమిటీ, 24 మంది టీచింగ్ ఫ్యాకల్టీ తొలగింపు, నచ్చిన వారిని కొనసాగించటంపై డాక్టర్ కె.స్వప్నవాహిణి కమిటీ, వర్సిటీ ఏర్పాటు నుంచి వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ అన్ని విధానాల్లో నియమించిన పోస్టుల నిబంధనలపై డాక్టర్ ఎం.అనురాధ కమిటీ నియమించారు. ఈ కమిటీల నివేదికపై త్వరలో పాలక మండలి సమావేశంలో చర్చించి, స్టాండింగ్ కమిటీ సూచనలు, సలహాలు తీసుకొని ముందుకు సాగాలని వీసీ భావిస్తున్నారు. వర్సిటీలో పారదర్శకత, అవినీతి రహిత పాలన లక్ష్యంగా ముందుకు సాగాలన్న లక్ష్యంతో వీసీ ఉన్నారు. మరో పక్క రెగ్యులర్ రిజిస్ట్రార్ నియామకం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య కొనసాగుతున్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత కొండూరు



విజేత జట్టు కొండూరుకు నగదు, షీల్డ్‌ను అందజేస్తున్న ధనుంజయ్‌కుమార్

సంతబొమ్మాళి: గొదలాం గ్రామంలో నందన్న ఆలయ 56వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా కొండూరు జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో కొండూరు, శివరాంపురం జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన కొండూరు జట్టుకు రూ. 15వేలు, రెండో స్థానంలో నిలిచిన శివరాంపురం జట్టుకు రూ. 10వేలు, మూడో స్థానంలో నిలిచిన బాడపల్లి జట్టుకు రూ. 8వేలు, 4వ స్థానంలో నిలిచిన గొదలాం జట్టుకు రూ. 7వేలు నగదుతో పాటు షీల్డ్‌ను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిలక ధనుంజయకుమార్ చేతుల మీదుగా అందజేశారు.

క్లుప్తంగా

ట్రావెల్స్ బస్సు బోల్తా: ఐదుగురికి గాయాలు




పొలంలోకి వెళ్లిపోయిన బస్సు.(ఇన్‌సెట్లో) చికిత్స పొందుతున్న ప్రయాణికురాలు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి కాశీ పుణ్యక్షేత్రం సందర్శనకు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి పొలంలోకి వెళ్లిపోయింది. దీంతో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం వేకువజామున 3 గంటల సమయంలో పార్వతీపురం నుంచి కాశీ తీర్థయాత్రకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో 22 మంది యాత్రికులు బయల్దేరారు. వారంతా తొలుత శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని శ్రీసూర్యనారాయణస్వామి పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు వెళ్తున్నారు. ప్రయాణం ప్రారంభమైన కొద్ది సేపటికే గరుగుబిల్లి మండలంలోని చిలకాం మలుపువద్ద ఎదురుగావస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బస్సు అదుపు తప్పి బస్సు షెల్టర్‌ను ఢీకొని పంటపొలంలోకి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు యాత్రికులకు స్వల్పగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని పార్వతీపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స అందజేశారు.

ఘనసరలో ఏనుగుల సంచారం



జొన్న పంటను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని ఘనసర చుట్టు పక్కల ఏనుగుల గుంపు ఆదివారం సంచరించింది. ఈ సందర్భంగా పచ్చని పంటలను పాడుచేస్తూ తినివేశాయి. రోడ్ల మీదకు వచ్చిన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాయి. పాత ఘనసర, కీసర, కోసలి మధ్య రోడ్డుపై నాలుగు ఏనుగుల గుంపు రెండుగా విడిపడి రోడ్ల వెంబడి తిరుగాడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వాటిని గమనించిన గ్రామస్తులు పరుగుపెట్టారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు భయంతో ఇంటి ముఖం పట్టారు.

20 మద్యం బాటిల్స్‌తో వ్యక్తి అరెస్ట్

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పట్టుబడినట్లు ఎస్సై వై.వీ జనార్దన్ తెలిపారు. శనివారం రాత్రి గ్రామానికి మద్యం తరలిస్తున్న సమాచారం తెలుసుకుని ఆ వ్యక్తి నుంచి 20 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

తోటల్లో అగ్నిప్రమాదం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస తోటల్లో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి సుమారు 15ఎకరాలకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన బి.కృష్ణ, వి.త్రినాథరావు, సత్యంనాయుడు, జి.రామారావు, వి.సన్యాసినాయుడు, చిన అప్పలనాయుడు, వి.చిన్నికృష్ణ తదితర రైతులకు చెందిన జీడి, మామిడి, టేకు తదితర మొక్కలు, చెట్లు నష్టపోయినట్లు గ్రామస్తులు చెప్పారు. రెవెన్యూ అధికారులు వచ్చి పరిస్థితిని గమనించారన్నారు.

చెట్టుకూలి వక్తి మృతి



చెట్టుకూలిన ప్రమాదంలో మృతిచెందిన శ్రీనివాసరావు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం భారీ వృక్షం నేలకూలడంతో ఓ వ్యక్తి గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన ముద్దన శ్రీనివాసరావు (44) బొబ్బిలి జంక్షన్ మీదుగా చీపురుపల్లి రోడ్డువైపు వెళ్తున్నాడు. చీపురుపల్లి ప్రధాన రహదారి పక్కన ఎర్రచెరువు గట్టును ఆనుకుని ఉన్న వృక్షం ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న శ్రీనివాసరావుకు చెట్టు కొమ్మలు తగలడంతో తీవ్రంగా గాయాల పాలయ్యాడు. వెంటనే స్థానికులు రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం కేర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి తల్లి సరోజిని తోపాటు భార్య ఉమ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందితే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని సీఐ డి.మోహనరావు తెలిపారు.

5వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమీశాలీ

విజయనగరం క్రైమ్: ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమీశాలీనిని బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న ఈమెను 5వ బెటాలియన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకూ 5వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న అధిరాజ్ సింగ్ రానాను విజయవాడ డీసీపీగా బదిలీ చేశారు.

ఆదర్శపాఠశాలలో ప్రవేశం..

బంగారు భవితకు సోపానం

- నేటి నుంచి నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష
- ఒక్కో పాఠశాలలో అదనంగా 20 సీట్లు పెంపు



కొత్తవలస ఆదర్శ పాఠశాల ముఖ చిత్రం

కొత్తవలస: గ్రామీణ ప్రాంతాల్లో గల ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆంగ్లభాషలో విద్యను ఉచితంగా అందించేందుకు మహానేత డాక్టర్ వైఎస్.రాజశేకర రెడ్డి ఆనాడే సంకల్పించారు. ఈ మేరకు 2013వ సంవత్సరంలో ఆదర్శపాఠశాలలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా 16 పాఠశాలలను స్థాపించారు. ఈ పాఠశాలల్లో ప్రతి సంవత్సరం 1600 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో అరవ తరగతిలో ఒక్కో పాఠశాలలోను 80 మంది విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలను కల్పించేవారు. ప్రస్తుతం వంద సీట్లకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ప్రవేశ పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా ప్రవేశాలను కల్పిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆరవతరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో బోధిస్తారు. కంప్యూటర్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, అత్యుత్తమ గ్రంథాలయాలు, మరెన్నో సౌకర్యాలతో కూడిన ప్రత్యేక శిక్షణతో విద్యాబోధన అందజేస్తున్నారు.

దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్హత

2024–25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన వారై ఉండాలి. ఓసీ, బీసీలకు చెందిన వారు 1.9.2012 నుంచి 31.8.2014 మధ్య జన్మించి ఉండాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే 1.9.2010 నుంచి 31.8.2014 మధ్య జన్మించిన వారు అర్హులు.

దరఖాస్తు చేసుకునే విధానం

విద్యార్థులు ఏపీ ఆన్‌లైన్ లేదా మీసేవాకేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75 ఫీజు చెల్లించాలి. దరఖాస్తుతో పాటు ఆధార్, కులం, ఆదాయం సర్టిఫికెట్లు, రేషన్‌కార్డు, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్ ఆయా మండల కేంద్రాల్లో గల ఆదర్శపాఠశాలల్లో అందజేయాలి.

రిజర్వేషన్లు ఇలా..

15శాతం ఎస్సీలకు, 6శాతం ఎస్టీలకు, 29శాతం బీసీలకు (7శాతం బీసీ–ఎ, 10శాతం బీసీ–బి, బీసీ–సీలకు ఒకశాతం, బీసీ–డీలకు 7శాతం, బీసీ–ఈలకు 4శాతం) సీట్ల కేటాయింపులు ఉంటాయి. దివ్యాంగులకు 3శాతం, బాలికలకు 33.33శాతం సీట్లు కేటాయించారు. నిర్దేశించిన విభాగాల్లో అభ్యర్థులు లేకపోతే ఇతర గ్రూపుల నుంచి భర్తీచేస్తారు. 50శాతం సీట్లు ఇతర కులాలకు నిర్దేశించారు.

ప్రవేశ పరీక్ష ఇలా..

ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఆయా ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ పద్ధతిలో తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుంది.

పాఠశాలల ప్రత్యేకత

ఉన్నత విద్యార్హతలు, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులతో బోధన, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆరవ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుకునే అవకాశం, జిల్లా, రాష్ట్రస్థాయి ఆటలపోటీలకు ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య, విశాలమైన లైబ్రరీ సదుపాయం, పూర్తిస్థాయి పరికరాలు కలిగిన సౌకర్యవంతమైన ప్రయోగశాలలు ఉన్నాయి.

అధునాతన వసతి గృహాలు

ఈ పాఠశాలల్లో చేరిన విద్యార్థినులకు ప్రత్యేకించి అధునాతన వసతి గృహాలను పాఠశాలకు అనుసంధానంగా నిర్మించారు. విద్యార్థినులకు మోడరన్ మంచాలు, దుప్పట్లు, బెడ్‌షీట్‌లు అందిస్తున్నారు. ఒక్కో హాస్టల్‌లో వంద మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. హాస్టల్‌లో కూడా హెచ్చు విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులతో ప్రత్యేక ట్యూటర్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.



అధునాతన హాస్టల్ భవనం

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించే దిశగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను నెలకొల్పింది. ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశం చక్కని అవకాశంగా విద్యార్థులు, తల్లిదండ్రులు భావిస్తున్నారు. నూతన భవనాలు, విశాలమైన తరగతి గదులు, ఎన్నో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఈ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. పి.శివప్రసాద్, ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్, కొత్తవలస మండలం

ప్రణాళికాబద్ధంగా పరీక్షలకు సిద్ధం కావాలి

- డీఈఓ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

చీపురుపల్లి: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎలా సిద్ధమవుతున్నారు, సిలబస్ ఎలా చదువుకుంటున్నారు, ఎలాంటి ప్రణాళికలు వేసుకున్నారని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షలంటే భయాన్ని వీడాలని, ధైర్యంగా పరీక్షలు రాసేందుకు ముందుకు వెళ్లాలని ధైర్యం చెప్పారు. ఏడాది కాలంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించిన, విద్యార్థులు చదివిన అంశాలు మాత్రమే పరీక్షా ప్రశ్నపత్రాల్లో వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఉన్న కొంత సమయంలో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తీర్ణత విద్యార్థుల సొంతమవుతుందన్నారు. విద్యార్థులు అంతా మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్యే సీట్లు

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడి డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రామస్వామి

విజయనగరం: జనాభా ప్రాతిపదికన విశ్వబ్రాహ్మణులకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రామస్వామి కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా ఆదివారం విజయనగరానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విశ్వబ్రాహ్మణులు రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం కావాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణులకు రానున్న ఎన్నికల్లో ప్రాతినిధ్యం కల్పించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది విశ్వబ్రాహ్మణ ఓటర్లు ఉన్నట్లు 2011 లెక్కలు తెలియజేస్తు న్నాయని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణకారులు, వడ్రంగి పనివారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని విమర్శించారు. తమ హక్కులు అడగడం కోసం, తమ డిమాండ్‌లను సాధించడం కోసం రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, పొన్నపల్లి అప్పారావు, నాగభూషణం, కోసూరు రాంబాబు, మందవరపు వరదాచారి లక్కోజు శేఖర్ గోడి అరుణ, వేముల ప్రకాశం లతోపాటు విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గ ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రి కుమారుడి మానవత్వం

- రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులకు ప్రథమ చికిత్స
- తన కారులో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలింపు



సంఘటనా స్థలంలో క్షతగాత్రుడు రాము కాలి గాయానికి టవల్‌తో అద్దిపెడుతున్న మంత్రి బొత్స కుమారుడు డా.సందీప్

చీపురుపల్లి: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బొత్స సందీప్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న మార్గంలో ప్రమాదం జరిగి రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులను చూసి చలించిపోయారు. వెంటనే తన కారు ఆపి కిందికి దిగి క్షతగాత్రుల పరిస్థితి తెలుసుకుని, వారికి ప్రథమ చికిత్స అందజేసి, తన కారులో వారిని ఎక్కించుకుని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి దగ్గరుండి వైద్యం అందించారు. ఆదివారం సాయంత్రం చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని ఆకులపేట సమీపంలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా సోషల్ మీడియాలో సైతం వైరల్ అయ్యింది. డా.బొత్స సందీప్ గరివిడి మండలంలోని వెదుళ్లవలసలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని తిరిగి విజయనగరం వెళ్తున్నారు. అదే సమయంలో ఆకులపేట వద్ద రోడ్డుపై అదే గ్రామానికి చెందిన పిల్ల రాము తన భార్య పాపతో కలిసి బైక్‌పై వెళ్తూ ప్రమాదం జరిగి రోడ్డుపై పడి ఉన్నారు. ఈ విషయాన్ని గమనించి డా.సందీప్ వెంటనే కారు దిగి, క్షతగాత్రుడు రాముకు తీవ్రంగా రక్తస్రావం అవుతుండడంతో ప్రథమ చికిత్స అందించారు. తరువాత తన కారులో వారిని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లి దగ్గరుండి చేర్పించి, అక్కడి వైద్యులతో కలిసి వైద్యం అందజేశారు. బాధితుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఇద్దరికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణపాయ స్థితిలో ఉన్న శంకరరావు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రహదారిలో రేగులపాడు జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి 8.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వీరఘట్టానికి చెందిన డి.శంకరరావు, పి.శ్రీనివాసరావు స్కూటీపై పాలకొండ మండలం పాట్లి గ్రామం నుంచి వీరఘట్టం వస్తుండగా రేగులపాడు జంక్షన్ వద్ద వారి స్కూటీని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రమాద సమాచారం తెలియడంతో 108 వాహనం ప్రమాదస్థలాలానికి వచ్చి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యచికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించింది.



తీవ్రంగా గాయపడిన శ్రీనువాసరావు

సైన్స్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విజ్ఞాన యాత్ర బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: విద్యార్థులు భవిష్యత్ సైన్స్‌తోనే ముడిపడి ఉందని అందుకనే ప్రభుత్వం విద్యార్థుల విజ్ఞాన యాత్రలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలోని కుప్పంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆవరణలో ఉన్న సైన్స్ ల్యాబ్‌లు తిలకించేందుకు జిల్లాలోని 16 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. వారంతా ఆదివారం చిత్తూరుకు బస్సులో బయిలుదేరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆ బస్సును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్తున్న విద్యార్థుల ఎంపికపై డీఈఓ ప్రేమ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. డీఈఓ మాట్లాడుతూ గతంలో జిల్లాలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసామని చెప్పారు. విద్యార్థులు ఇంటికి వచ్చేంత వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా విజ్ఞాన యాత్రకు వెళ్తున్న 40 మంది విద్యార్థుల భోజన, వసతి నిమిత్తం జెడ్పీ చైర్మన్ రూ.50వేలు అందజేశారు. అవసరమైతే మరింత సాయం చేస్తానని ఆయన ప్రకటించారు. జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, సువ్వాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

- మరో నలుగురికి గాయాలు



సీతంపేట: సంఘటనా స్థలంలో గాయాలపాలైన వ్యక్తులు

సీతంపేట: మండలంలోని కుశిమి జంక్షన్ వద్ద ఆదివారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో రాజాం పట్టణానికి చెందిన మణికంఠ (30) మృతిచెందాడు. ఈ ప్రమాదంలో మరో నలుగురికి గాయాలయ్యాయి. ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. కొత్తూరుకు చెందిన చంద్రకాంత్, భార్య అనూషలు ఆమదాలవలసకు సొంతపనిమీద వెళ్లి బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో రాజాం పట్టణానికి చెందిన మణికంఠ, రాఖేష్, తరుణ్‌కుమార్‌లు సీతంపేట అడ్వెంచర్ పార్కుకు వచ్చి తిరుగుప్రయాణంలో బైక్‌పై అతివేగంగా వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న చంద్రకాంత్ బైక్‌ను కుశిమి కూడలి వద్ద బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి అంతా తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే స్థానికుల చొరవతో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మణికంత మృతిచెందాడు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారు. అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీష్‌నాయుడు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

మరో ప్రమాదంలో ట్యాక్సీ డ్రైవర్..



రామభద్రపురం: శ్రీనివాసరావు మృతదేహం

రామభద్రపురం: సాలూరుకు చెందిన తాడుతూరి శ్రీనివాసరావు(43) అతి వేగంగా ట్యాక్సీని నడపడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనపై ఎస్సై వి.జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్యాక్సీ డ్రైవర్ శ్రీనివాసరావు విజయనగరం బేరమాడుకుని నెలిపర్తికి చెందిన రవికుమార్‌ను వాహనంలో ఎక్కించి స్పీడుగా వెళ్తుండగా రామభద్రపురం మండలం ఎరుకుల పాకల వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్యాక్సీ బోల్తా కొట్టి కాలువ అవతల ప్రాంతంలో పడిపోవడంతో ఛాతీకి, తలకు గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. లోపలున్న రవికుమార్‌కు స్వల్పగాయాలయ్యాయి. మృతుడి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కష్ట కాలంలో.. అన్నదాతకు అండగా...

రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. సాగు పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు కొనుగోలు వరకు రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్నీ తానై సహకరిస్తోంది. అదే సమయంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో జరిగే నష్టాలకు రోజుల్లోనే పరిహారం అందజేసి అండగా నిలుస్తోంది.

- పంట నష్టం జరిగిన వెంటనే పరిహారం చెల్లింపు
- 2019 నుంచి ఇప్పటి వరకు రూ.4.92 కోట్ల చెల్లింపు
- 14,290 మందికి లబ్ధి



నీట మునిగిన వరి పంట (ఫైల్)

విజయనగరం ఫోర్ట్:

రైతు సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టింది. సాగు పెట్టుబడికి రైతు భరోసా పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తూ విత్తనాల నుంచి ఎరువుల దాకా రైతుకు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సాయం చేయడమే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంభవించేటప్పుడు పంట దెబ్బతిన్న సమయంలో కూడా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. పంట నష్టం జరిగిన వెంటనే రైతులకు పరిహారం అందించి వారికి భరోసా కల్పించింది. 2019 నుంచి ఇప్పటివరకు సంభవించిన ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్ట పోయిన వేలాది మంది రైతులకు ప్రభుత్వం కోట్లాది రుపాయిల పరిహారం అందించింది.

టీడీపీ హయాంలో ఇలా...

తెలుగుదేశం పార్టీ హయాంలో ప్రకృతి వైపరీత్యాలు (అతివృష్టి, అనావృష్టి) సంభవించేటప్పుడు పంట నష్టం జరిగిన ఏడాది, ఏడాదిన్నరకుగాని రైతులకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పరిహారం చెల్లించేది కాదు. రైతులకు ఇచ్చే పరిహారాన్ని కూడా బినామీ పేర్లతో టీడీపీ నేతలు బొక్కేసేవారు. పంట నష్టం జరగని వారు, భూమిలేని వారు సైతం పంట నష్టం జరిగినట్లు రాయించుకుని పరిహారం తీనేసేవారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టాక పంట నష్టం జరిగిన నెలలోపే రైతులకు పరిహారం అందించింది. పంట నష్టం అంచనాను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. అంతేకాకుండా ఈ–క్రాప్ నమోదు ఆధారంగా పంట నష్టం అంచనా వేయడం వల్ల బినామీలకు ఆస్కారం లేకుండా పోయింది. పంట నష్టం జరిగిన పంట ఫొటోతో పాటు, రైతు ఫొటోను అప్‌లోడ్ చేయడం వల్ల అవినీతికి తావు లేకుండా పంట నష్ట పరిహారం అందే పరిస్థితులు నెలకొన్నాయి.

రూ.4.92 కోట్ల పరిహారం అందజేత

2019 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం కోట్లాది రుపాయిల పరిహారాన్ని రైతులకు అందించింది. గడిచిన ఐదేళ్లలో పంట నష్ట పరిహారం కింద 14,290 మంది రైతులకు సంబంధించి 3632.40 హెక్టార్లలో పంట నష్టం సంభవించగా రూ.4.92 కోట్లు ప్రభుత్వం అందజేసింది. పంట నష్టం సంభవించిన రోజుల్లో నే ఈ మొత్తాన్ని అందజేయడంతో అన్నదాత కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచినట్టయింది.

పరిహారం బ్యాంకు ఖాతాలో జమ



పంట నష్టం జరిగిందని రైతులు తెలిపిన వెంటనే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్‌ఓ సంయుక్తంగా పంట నష్టం అంచనా వేసి ప్రతిపాదనలు పంపిస్తారు. వాటిని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. పంట నష్టం జరిగిన వెంటనే ప్రభుత్వం వారి ఖాతాల్లో పరిహారాన్ని జమ చేస్తోంది. – వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నెల రోజుల్లోపే...



2021లో పంట కోత కోసే సమయంలో నీట మునిగింది. ఈ విషయాన్ని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు చెప్పాను. అతను నీట మునిగిన పంటకు, నాకు ఫొటో తీసి పంపించారు. పంట నష్టం జరిగిన నెల రోజుల్లోపు నా బ్యాంకు ఖాతాలో రూ.6 వేలు ప్రభుత్వం పంట నష్ట పరిహారం వేసింది. ఇంతకంటే ఏం కావాలి.

– సిరపురపు గోవింద, రైతు పెదవేమలి

ఐదేళ్లలో పంట నష్ట పరిహారం చెల్లింపులు ఇలా...

సంవత్సరం	నష్టపోయిన రైతులు	పంట దెబ్బతిన్న విస్తీర్ణం	చెల్లించిన మొత్తం
2019 - 20	828	216.10 హెక్టార్లు	రూ.31.80 లక్షలు
2020 - 21	6882	1707.19 హెక్టార్లు	రూ.2.26 కోట్లు
2021 - 22	4880	1291.41 హెక్టార్లు	రూ.1.81 కోట్లు
2022 - 23	105	21.03 హెక్టార్లు	రూ.3.09 లక్షలు
2023 - 24	1595	395.75 హెక్టార్లు	రూ.49.47 లక్షలు